సమస్యల చదువులు!



కోటబొమ్మాళి:ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్న శ్రీజగన్నాథపురం ప్రాథమిక పాఠశాల

కొద్దిరోజుల క్రితం వరకు ప్రభుత్వ పాఠశాలలు ఒక వెలుగు వెలిగాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత అదే పాఠశాలల్లో సమస్యలు ఆరంభమయ్యాయి. విద్యార్థుల చేరికపై నిర్వహించిన 'బడికి పోదాం' కార్యక్రమం అంతగా ఫలితాలను ఇవ్వలేదు. ఫలితంగా పాఠశాలల్లో విద్యార్థుల చేరిక తగ్గిందనే చెప్పాలి. అలాగే ఉపాధ్యాయుల కొరత వెంటాడుతోంది. మధ్యాహ్నం భోజనం సక్రమంగా అమలు కావడం లేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యా సంవత్సరం ఆరంభమై రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ చాలామంది పిల్లలకు విద్యాకానుక కిట్లను అందించలేదు.



సంతబొమ్మాళి మండలం గోవిందపురంలో ఏకోపాధ్యాయ పాఠశాల



టెక్కలి మండలం పెద్దరోకళ్లపల్లి గ్రామంలో మరో ఉపాధ్యాయుడిని నియమించాల్సిన ప్రాథమికోన్నత పాఠశాల

5,444 మందికి అందని విద్యా కానుక

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితిని గమనిస్తే.. టెక్కలి మండలంలో పెద్దరోకళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాల్సినప్పటికీ ఒక్కరు మాత్రమే ఉన్నారు. అలాగే మండలంలో మూడో తరగతి విద్యార్థుల్లో కొంత మందికి పూర్తిస్థాయిలో విద్యా కానుక కిట్లు అందలేదు. నరసింగపల్లి, పెద్దరోకళ్లపల్లి పాఠశాలలో ఒక్కొక్కటి చొప్పున ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

- సంతబొమ్మాళి మండలంలో గత ఏడాది కంటే ఈసారి తక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. 13 ప్రాథమిక పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఉండడంతో, కొన్ని సందర్భాల్లో పాఠశాలలు మూసివేయాల్సిన పరిస్థితి చోటు చేసుకుంటోంది. ఈ ఏడాది సుమారు 5,444 మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందలేదు.
- కోటబొమ్మాళి మండలంలో బడికి పోదాం కార్యక్రమం పూర్తిగా సత్ఫలితాలను ఇవ్వకపోవడంతో జగన్నాథపురం, గంగుపేట, జర్జంగి, మహాదేవపురం, నరసింగపల్లి, రామచంద్రపురం పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారు.
- నందిగాం మండలంలో విద్యార్థులకు విద్యా కానుకలో భాగంగా అందజేసిన బూట్లు సరైన కొలతలు లేకపోవడంతో వాటిని తిరిగి పంపించేశారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు బ్యాగులు అందజేయలేదు. మండలంలో 34 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండడంతో, అత్యవసర సమయాల్లో పాఠశాలలో నిర్వాహణ కష్టతరంగా మారుతోంది. గత ప్రభుత్వం మాదిరిగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల నిర్వాహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

10 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ

సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధి సోంపేట మండలంలో మొత్తం 79 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 51 ప్రాథమిక, తొమ్మిది ప్రాథమికోన్నత, 19 ఉన్నత పాఠశాలల్లో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. పాఠశాలలు ప్రారంభం నాటికి విద్యార్థులకు పుస్తకాలు అందజేయాల్సి ఉన్నా జూలై నెలాఖరు వరకు పంపిణీ జరిగింది.

కవిటి మండలంలో 22 పోస్టులు ఖాళీ

కవిటి: కవిటి మండలంలోని 102 ప్రభుత్వ పాఠశాలల్లో 255 మంది ఉపాధ్యాయులు అవసరం ఉండగా.. 233 మంది విధులు నిర్వహిస్తున్నారు. మరో 22 మంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సాగని బోధన

కంచిలి: మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో బోధన సక్రమంగా సాగడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయలేదు. ఫలితంగా అడ్మిషన్లు కూడా తగ్గుతున్నాయి.

- మఠం సరియాపల్లి, ఎక్కల ప్రాథమిక పాఠశాలలో ఎల్.ఎఫ్.ఎల్. హెచ్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- సాగరనౌగాం, సవర గోవిందపురం, జిల్లుండ, జక్కర,కేసరపడ, నారాయణబట్టి, ఒరియా నారాయణపురం, కాళింగపుట్టుగ, ప్రధానపుట్టుగ పాఠశాలలో ఒక్కో ఎస్జీటీ ఉపాధ్యాయ పోస్టు, కొక్కిలిపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- బదిలీలు ప్రక్రియ రద్దు చేయడంతో పోలేరు, జె.భైరిపురం ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు, ముండ్ల జె ఉన్నత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయుల బదిలీలు రద్దయ్యాయి.

కుంటుపడుతున్న విద్యావ్యవస్థ

ఇచ్ఛాపురం: నియోజకవర్గ కేంద్రం ఇచ్ఛాపురం పట్టణంలోని ప్రభుత్వోన్నత, మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. దీంతో విద్యాబోధన కుంటుపడుతుంది.

- ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్, ఒడియా మాధ్యమాలకు చెందిన 1202 మంది విద్యార్థులున్నారు. వీరికి విద్యాబోధన చేసేందుకు 55 మంది ఉపాధ్యాయులు అవసరం. ప్రస్తుతం 35 మంది ఉపాధ్యాయులతోనే బోధన జరుగుతోంది.
- ఇదే పాఠశాలలో తెలుగు బోధించేందుకు ఆరుగురు ఉపాధ్యాయులు అవసరం ఉండగా.. ఒక్కరు కూడా లేరు.
- ఒడియా మాధ్యమంలో విద్యను బోధించే సైన్స్ ఉపాధ్యాయులెవరూ లేరు. దీంతో ఆ మాధ్యం విద్యార్థుల పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది.
- మున్సిపాలిటీ పరిధిలో 17 మున్సిపల్ ప్రాథమిక ఉన్నత పాఠశాలుండగా.. 6,235 మంది విద్యార్థులున్నారు. వీరికి 110 మంది ఉపాధ్యాయులు అవసరం ఉండగా.. 80 మంది ఉపాధ్యాయులే బోధన చేస్తున్నారు.

హిందీ బోధన లేదు..

ఇచ్ఛాపురం రూరల్: మత్స్యకార గ్రామం డొంకూరు. ఇక్కడ ఉన్న ఉన్నత పాఠశాలలో 324 మంది విద్యార్థులు చదువుతుండగా.. వీరికి 10 మంది ఉపాధ్యాయులే ఉన్నారు. ఇక్కడ పనిచేసే హిందీ ఉపాధ్యాయుడ్ని వర్క్ ఎడ్జెస్ట్‌మెంట్ ద్వారా లొద్దపుట్టి ఉన్నత పాఠశాలకు బదిలీ చేయడంతో రెండేళ్లుగా హిందీని బోధించే ఉపాధ్యాయుడే లేకుండా పోయింది. ఫిజిక్స్ పోస్టు కూడా ఖాళీగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

ఉపాధ్యాయుల్లేరు!

వజ్రపుకొత్తూరు: పలాస నియోజకవర్గం పరిధి వజ్రపుకొత్తూరు మండలంలో 64 ప్రాథమిక పాఠశాలలు, పది ప్రాథమికోన్నత పాఠశాలలు, 17 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. లింగాలపాడు, శివరాంపురం, మర్రిపాడు పాఠశాలలు పూర్తిగా శిథిలమైయ్యాయి. దీంతో ఆయా పాఠశాలలను ప్రైవేటు వ్యక్తుల ఇళ్లలో నడుపుతున్నారు.

- పాతటెక్కలి పంచాయతీ లింగాలపాడులో ఓ ప్రైవేటు వ్యక్తికి చెందిన రేకుల షెడ్‌లో విద్యార్థులు చదువుతున్నారు.
- మర్రిపాడులో నలుగురు విద్యార్థులతో ఓ ప్రైవేటు ఇంటిలో పాఠశాలను నడుపుతున్నారు.
- శివరాంపురంలో ఒకే ఒక విద్యార్థి ఉండగా ఆ విద్యార్థికి ఓ టీచర్ బోధన చేస్తున్నారు.
- గోవిందపురం, డోకులపాడు, గరుడభద్ర ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్ సబ్జెక్ట్ ఉపాధ్యాయుల కొరత ఉంది. దీంతో అక్కడ విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధన జరగడం లేదు.
- కొత్తగాపాఠశాలల్లో చేరిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను సర్దుబాటు చేశారు.



వజ్రపుకొత్తూరు: లింగాలపాడు పాఠశాల శిథిలమవడంతో రేకుల షెడ్‌లో చదువుతున్న విద్యార్థులు

తెలుగు బోధన జరగడంలేదు



ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులు లేరు. దీంతో టైమ్‌టేబుల్ ప్రకారం బోధన జరగని పరిస్థితి. తెలుగు సబ్జెక్టుకి టీచర్ లేకపోవడంతో ఆందోళనగా ఉంది. ఈ కారణంగా తప్పనిసరిగా ట్యూషన్‌కు వెళ్లాల్సి వస్తుంది.

–ఆశి రేవంత్,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విద్యార్థి.

ఉపాధ్యాయులు లేక ఇబ్బంది



మా బడిలో 324 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ పనిచేసే హిందీ ఉపాధ్యాయుడ్ని వర్క్ ఎడ్జెస్ట్‌మెంట్ ద్వారా వేరే పాఠశాలకు బదిలీ చేయడంతో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఫిజిక్స్ ఉపాధ్యాయుడు పోస్టు కూడా ఖాళీగా ఉంది.

– జె.సరోజిని, ప్రధానోపాధ్యాయురాలు,
డొంకూరు, ఇచ్ఛాపురం మండలం

'అధిష్టానం ఆదేశాలు పాటించాలి'



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

కాశీబుగ్గ: అధిష్టానం ఆదేశాలను ప్రతి కార్యకర్త పాటించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఓ కల్యాణ మండపంలో పార్టీ పట్టణ అధ్యక్షులు వైశ్యరాజు మోహనరాజు అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కార్యకర్త లాభాపేక్షకు పోకుండా కేంద్ర, రాష్ట్ర పార్టీలు ఇచ్చే కార్యక్రమాలను విధిగా చేపట్టాలని సూచించారు. ముందుగా నెహ్రూ పార్క్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస వైకుంఠరావు, సీనియర్ నాయకులు పైల రాజరత్నం నాయుడు, నియోజకవర్గం కోకన్వీనర్ చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ యాదవ్, టౌన్ ప్రధాన కార్యదర్శులు హనుమంతు రామారావు, గొంటి అప్పారావు, కె.పి.రామన్న, కర్రి ప్రసాదరావు, పి.వి.శ్రీనివాసరావు, లక్కోజు ధర్మారావు, పి.తారకేశ్వరరావు, కిక్కర ప్రకాశరావు, బూర్జపేట హరికృష్ణ, కంచరాన పోలినాయుడు పాల్గొన్నారు.

వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోండి



బార్ అసోసియేషన్ ప్రతినిధికి ఆదేశాల కాపీని అందజేస్తున్న జడ్జి మాధురి

కాశీబుగ్గ: పలాస, వజ్రపుకొత్తూరు మండలాలతో పాటు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అర్హత ఉండి వితంతు పింఛన్ అందనివారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి యూ.మాధురి అన్నారు. పలాసలో బార్ అసోసియేషన్ వారికి ఈ మేరకు ఆదివారం సూచన చేస్తూ ఆదేశించారు. దరఖాస్తు చేసుకోవడానికి సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు పలాస మండల పరిషత్ కార్యాలయం వద్దకు హాజరు కావాలని సూచించారు. దరఖాస్తుతోపాటు ఆధార్, రేషన్ కార్డులను, రెండు పాస్ ఫొటోలను అందించాలన్నారు. పలాస జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ ఆథారిటీ వారి ఆదేశాల మేరకు జరుగుతున్న ఈ ప్రక్రియను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తులను జిల్లా కోర్టు నుంచి నేరుగా ఏపీ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ వారికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎ స్.అనిల్‌రాజ్ పాల్గొన్నారు.

సందడిగా స్నేహితుల దినోత్సవం



24వార్డులో మొక్క నాటుతున్న స్నేహితులు



సోంపేట: రోగులకు పండ్లు అందజేస్తున్న స్నేహహస్తం ప్రతినిధులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. చేతులకు బ్యాండ్ కట్టుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేశారు. సత్యసాయి భక్తులు 24వ వార్డులో యువజన నాయకుడు సప్ప నవీన్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. మదర్‌థెరిసా పాఠశాల ఉపాధ్యాయినులు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లతో సందడి చేశారు.

సోంపేట: సోంపేట పట్టణంలో స్నేహ హస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు పలువురు మాట్లాడుతూ.. 1988–89 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులంతా కలిసి స్నేహ హస్తం సంస్థను ఏర్పాటు చేసుకున్నట్టు చెప్పారు. అప్పటి నుంచి స్నేహితుల దినోత్సవం రోజున ఏటా కలుసుకుంటున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా సోంపేట సామాజిక ఆస్పత్రిలోని 50 మంది రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు కె.జగదీశ్, అధ్యక్షుడు రమేష్‌కుమార్ పాణిగ్రాహి, సంస్థ ప్రతినిధులు పి.మల్లేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఎస్సీల వర్గీకరణకు కుట్ర



కొవ్వొత్తులతో నిరసన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

టెక్కలి: ఎస్సీల వర్గీకరణ నిర్ణయం దుర్మార్గపు చర్య అని దళిత సంఘాల నాయకులు మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ నిర్ణయానికి వ్యతిరేఖంగా టెక్కలిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులతో కలిసి కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అధికార ప్రభుత్వం, సుప్రీంకోర్టు ఏకమై ఎస్సీల వర్గీకరణకు కుట్ర పన్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పును తక్షణమే ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కుప్పిలి కామేశ్వరరావు, చల్లా రామారావు, కూరాకుల యాదవ్, టి.సూర్యం, పి.పాపారావు, ఎస్.దామోదరరావు, టి.గురుమూర్తి, బి.బాలకృష్ణ, బి.చిన్నారావు ఉన్నారు.

జిల్లా ఆస్పత్రిలో శానిటేషన్ పనులు



శానిటేషన్ పనులు చేస్తున్న సిబ్బంది

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా ఆస్పత్రిలో ఆదివారం శానిటేషన్ పనులు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యారావు పర్యవేక్షణలో పరిసరాలను శుభ్రం చేశారు. కె.కొత్తూరు పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

ఐక్యమత్యంతో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న ధర్మారావు

వజ్రపుకొత్తూరు రూరల్: ఐక్యమత్యంతో సమస్యలను పరిష్కరించుకుందామని స్థానిక కంచికామక్షి విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు లక్కోజు ధర్మారావు అన్నారు. వజ్రపుకొత్తూరులోని కంచికామాక్షి ఆలయంలో సంఘ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సమస్యలపై సభ్యులతో చర్చించారు. వచ్చే నెలలో జరగనున్న విశ్వకర్మ, కంచికామాక్షి పూజలను ఘనంగా చేయాలని నిర్ణయించుకున్నారు. సభ్యులు కేశవరావు, కె.జగ్గారావు, బి.చింతామణి ఉన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి పూజలు



చౌడేశ్వరిదేవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

సోంపేట: ఆషాఢ అమావాస్య సందర్భంగా చౌడేశ్వరిదేవి పూజలను దేవాంగ కుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరి దేవి కల్యాణ మండపంలో ఉదయం ఆరు గంటల నుంచి ఘనార్చన, కుంకుమపూజలు, భజనలు చేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం అమ్మవారి ఘటాలను పట్టణంలో ఊరేగించారు.

దనరాజులమ్మకు పూజలు



ఇచ్ఛాపురం రూరల్: కాళీమాత వేషధారణలో కళాకారుడు

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టిలోని ధనరాజుల తులసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కాళీమాత వేషధారణ, సన్నాయి మేళం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి ఎదుట భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆంధ్రా, ఒడిశా నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



మొక్కలు నాటుతున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కాశీబుగ్గ/వజ్రపుకొత్తూరు రూరల్: మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు అన్నారు. పలాస–కాశీబుగ్గ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ జిల్లా గవర్నర్ ప్రొఫెసర్ వి.ఎ స్.ఎస్.ప్రసాద్ ఇచ్చిన పిలుపు మేరకు బెండి ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. లక్ష మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే పాఠశాలకు మధ్యాహ్న భోజనం వంట కోసం షెడ్‌పై రేకులను క్లబ్ సభ్యులు సమకూర్చారు. ప్రతి విద్యార్థికి రెండేసి నోటుబుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. సేవా కార్యక్రమాలకు డోకి రామారావు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ మొదటి వైస్ గవర్నర్ డి.సూర్యప్రకాష్, రీజియన్ చైర్‌పర్సన్ పూన రంగనాథ్, పలాస–కాశీబుగ్గ క్లబ్ ప్రెసిడెంట్ హెచ్ వై.దొర, సెక్రటరీ తమ్మినాన మాధవరావు, కోశాధికారి నెమలిపురి అప్పారావు, వెంకటరావు, దాటీ బాలకృష్ణమూర్తి, పి.వి.సతీష్ పాల్గొన్నారు.

నేడు భవిత కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు

టెక్కలి: టెక్కలి భవిత కేంద్రంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు స్థానిక కోర్టు సముదాయం సిబ్బంది ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మానసిక దివ్యాంగులకు అందజేస్తున్న న్యాయ సేవలపై ఉదయం 9.30 గంటలకు సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

పాఠశాల మరమ్మతులకు రూ. 60 వేల సాయం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: మందస మండల కేంద్రంలో 125 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీరాజా శ్రీనివాస స్మారక ఉన్నత పాఠశాల మరమ్మతులకు పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆర్థిక సాయం చేస్తున్నారు. తాజాగా ఇదే పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది సైతం ముందుకు వచ్చారు. తమవంతుగా 60 వేల రూపాయలను సమకూర్చారు. ఈ మొత్తాన్ని ప్రధానోపాధ్యాయులు జె.రవికుమార్, ఇన్‌చార్జి ప్రధాన ఉపాధ్యాయులు రామచంద్ర పాణిగ్రాహి, పాఠశాల సిబ్బంది, కార్యదర్శి సురేష్ చంద్ర పండా, పాఠశాల సిబ్బంది చేతుల మీదుగా పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పట్నాల మోహన్‌రావుఆచారికి అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి శిష్టు సోమనాథ్, మామిడి కోదండరావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



పరామర్శలో శ్రీధర్‌బాబా తదితరులు

కాశీబుగ్గ: పలాస మండలం రాజగోపాలపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మండల రైతు అభివృద్ధి కమిటీ చైర్మన్ గొర్లె వేణుగోపాల్ మాతృమూర్తి పద్మావతి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్‌బాబా ఆదివారం వేణుగోపాల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు కూన హేమాచలం, శ్రీనివాస్, కామేశ్వరరావు, రవీంద్ర, పినకాన తిరుమలరావు, భానుమూర్తి, విశ్వనాథ ఉన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు రూరల్: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను డోకులపాడు గ్రామస్తులు ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండున్నర ఏళ్ల తర్వాత జరగనున్న స్థానిక ఎన్నికల సమరానికి కూటమి నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. అలాగే ఈ నెల ఎనిమిదో తేదీన జరగనున్న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలపై నాయకులు దృష్టి పెట్టాలని సూచించారు. మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ, నాయకులు లండ గిరిబాబు, సూరాడ మోహన్‌రావు, దువ్వాడ జయరాం చౌదరి, పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, తిమ్మల దుష్యంత్, ఎం.రమేష్, యుగంధర్, నెయ్యిల సూర్యానారాయణ ఉన్నారు.

సున్నాపురంలో ఆయుర్వేద వైద్యశిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సున్నాపురం గ్రామంలో ఆదివారం ఆయుర్వేద, దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్లోబల్ మల్టీస్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రి వారి సౌజన్యంతో దీన్ని నిర్వహించారు. 200 మంది ఆయుర్వేద, వంద మంది దంత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. రోగులకు రూ. 60 వేలు విలువైన మందులను రోటరీక్లబ్ సమకూర్చింది. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు ప్రేమ్‌కుమార్‌జెన్నా, డెంటల్ వైద్యులు వేదవ్యాస్, లక్ష్మి, రోటరీ క్లబ్ అధ్యక్షులు పైడిశెట్టి దినేష్, రోటేరియన్స్ ఎం.నవీన్‌కుమార్, వీకే ప్రసాద్, జోగారావు, నవీన్‌చౌదరి, వల్లంపాటి సురేష్‌కుమార్, ప్రదీప్, షణ్ముఖ ఉన్నారు.

కాపుతెంబూరులో ఫీవర్ సర్వే



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

నందిగాం: మండలంలోని కాపుతెంబూరులో ఆదివారం ఫీవర్ సర్వే చేపట్టారు. స్థానిక ఏఎన్ఎం రోహిణి, ఎంఎల్‌హెచ్‌ఓ మురళీలు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి రక్త పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో ఎవరికీ జ్వరాలు లేవని.. ఆందోళన చెందవలసిన అవసరం లేదని వైద్య సిబ్బంది తెలిపారు. ఆశ కార్యకర్తలు మీనా, పద్మావతి ఉన్నారు.